క్లుప్తంగా

ముగిసిన ప్రతిష్ఠోత్సవం



ఆంజనేయస్వామి ఆలయం వద్ద ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరం పడమటి వీధిలో శ్రీ ప్రతాపరుద్ర ఆంజనేయ స్వామి ఆలయం వద్ద చేపట్టిన ప్రతిష్ఠోత్సవ కార్యక్రమం బుధవారం ముగిసింది. మూడు రోజులుగా ఆలయం వద్ద వివిధ పూజా కార్యక్రమాలు, హోమాలు, ధ్వజ గ్రామోత్సవం వంటివి గావించారు. చివరి రోజు బుధవారం ఉదయం అధిక సంఖ్యలో తరలి వచ్చిన ప్రజల సమక్షంలో పండితులు వేద మంత్రోచ్చారణలతో ఆలయం పైభాగాన శిఖర కలశ ప్రతిష్ఠ, ఆలయం ఎదురుగా ధ్వజ ప్రతిష్ఠోత్సవం గావించారు.

ముగిసిన 'పది'పరీక్షల మూల్యాంకనం

నంద్యాల(న్యూటౌన్): పట్టణ సమీపంలోని ఎస్డీఆర్ పాఠశాలలో ఈనెల 3వ తేది నుంచి ప్రారంభమైన పదవతరగతి పబ్లిక్‌పరీక్షల మూల్యాంకనం బుధవారంతో ముగిసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లాకు 1,78,182 సమాధానపత్రాలు రాగా, వాటి మూల్యాంకనం పూర్తయిందన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నంద్యాల(అర్బన్): మెగా డీఎస్సీ పరీక్షకు ఉచిత ఆన్‌లైన్ కోచింగ్ పొందేందుకు అర్హత కలిగిన ఎస్సీ,ఎస్టీ, బీసీ, ఈబీసీ విభాగాలకు సంబంధించిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతులు, సాధికారత అధికారిణి లక్ష్మీదేవి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. టెట్ అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. అభ్యర్థులు వారివారి సొంత జిల్లాల్లోనే దరఖాస్తు చేసుకోవాలని, వారు పూరించిన దరఖాస్తుకు కుల, నేటివిటీ, ఆదాయ, టెట్ అర్హత సాధించిన రుజువు పత్రం ఎన్‌క్లోజర్లతో సంబంధిత డీబీసీడబ్ల్యూఈఓకు సమర్పించాలన్నారు. ఈనెల 15వ తేదీ లోగా పూర్తి చేసిన దరఖాస్తులను సంబంధిత కార్యాలయంలో అందజేయాలన్నారు.

12న ఉచిత వైద్య శిబిరం

నంద్యాల(అర్బన్): పట్టణంలోని సాయి బాలాజీ నర్సింగ్ హోంలో ఈనెల 12న (శనివారం) ఫిట్స్ వ్యాధిపై ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి వైద్యులు హరినాథరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. యశోద హాస్పిటల్ హైటెక్ సిటీ వారి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ వైద్యశిబిరాన్ని రోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెద్దమ్మదేవరకు సహకరించాలి



ఎస్‌ఐని సత్కరిస్తున్న పెద్దమ్మ ఆలయకమిటీ సభ్యులు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన శ్రీమూల పెద్దమ్మ దేవర ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని ఎస్ఐ సత్యనారాయణను ఆలయ కమిటీ సభ్యులు తలారి శ్రీనివాసులు, మిద్దె శంకరయ్య, చిన్నన్న, కె.చిన్న పెద్దన్న కోరారు. ఇటీవల నూతన ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఆయనను బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అనంతరం మే నెలలో పెద్దమ్మకు 11 ముడుపు కడతామని, అలాగే జూన్ 8,9,10 తేదీల్లో పెద్దమ్మ దేవర నిర్వహించాలని ఖరారు చేసినట్లు ఎస్ఐకి వివరించారు.

చంద్రరాజేశ్వరరావు ఆశయాలను సాధిస్తాం



నివాళులర్పిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): అమరజీవి, ప్రజా ఉద్యమాల నిర్మాత భూ పోరాట యోధుడు సీపీఐ పూర్వ జాతీయ కార్యదర్శి చంద్రరాజేశ్వరావు ఆశయాలను సాధిస్తామని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్, పట్టణ కార్యదర్శి ప్రసాద్, ఏపీ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవి అన్నారు. బుధవారం చంద్రరాజేశ్వరరావు వర్ధంతి సందర్భంగా ఆ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

16న జాబ్‌మేళా

డోన్ టౌన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 16న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ భారతి తెలిపారు. జాబ్‌మేళాకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్‌రెడ్డి చేతుల మీదుగా బుధవారం విడుదల చేయించారు. ఆమె మాట్లాడుతూ ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ వారి ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్‌మేళాలో 15 కంపెనీల ప్రతి నిధులు పాల్గొంటారన్నారు.

చేదు రోగాలకు తీపి వైద్యం!

- హోమియోకు పెరుగుతున్న ఆదరణ
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 22 ప్రభుత్వ డిస్పెన్సరీలు
- అన్ని చోట్లా ఉచితంగా చికిత్స, మందులు
- దీర్ఘకాలిక, మొండి రోగాలకు ఉత్తమ చికిత్స
- నేడు వరల్డ్ హోమియో డే

గోస్పాడు: చాలా మంది జబ్బు చేసినప్పుడు మందులు మింగాలంటే ఇబ్బంది పడుతుంటారు. కొన్ని రకాల మందులు, సిరప్‌లు చేదుగా ఉంటాయని తిరస్కరిస్తుంటారు. కానీ ఏ వ్యాధికైనా తియ్యని గుళికలతో నాలుకకు, మనసుకు ఇబ్బంది లేకుండా మందును అందించే ఏకైక వైద్యవిధానం హోమియోపతి. ఈ వైద్యులు ఇచ్చే మందులు నోట్లో వేసుకోగానే కమ్మగా కరిగిపోతాయి. జర్మని దేశానికి చెందిన డాక్టర్ క్రిస్టియన్ ప్రెడరిక్ శామ్యూల్ హానీమన్ మొదటిసారిగా హోమియో విధానాన్ని కనుగొన్నారు.ఆయన జన్మదినానికి గుర్తుగా ఏటా ఏప్రిల్ 10న హోమియో డేగా జరుపుకుంటారు.

జిల్లాలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో 12 రెగ్యులర్, 10 ఎన్‌హెచ్ఎం కలిపి మొత్తం 22 హోమియో డిస్పెన్సరీలు ఉన్నాయి. ఆయా డిస్పెన్సరీలకు



చాపిరేవులలో పరీక్షిస్తున్న హోమియో వైద్యుడు

ప్రతిరోజూ 40 నుంచి 60 మంది వరకు రోగులు చికిత్స కోసం వస్తున్నారు. కర్నూలు, నంద్యాల, డోన్‌లాంటి చోట్ల ఓపీ రోగుల సంఖ్య మరింత ఎక్కువగా ఉంటోంది. అన్ని డిస్పెన్సరీలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పనిచేస్తున్నాయి. ఇక్కడ చికిత్సతో పాటు మందులు కూడా ఉచితంగా ఇస్తున్నారు. ఇతర వైద్య విధానాల్లో మందులు వాడి విసుగు చెందిన వారు హోమియోవైపు మొగ్గు చూపుతున్నారు. నంద్యాల నగరంలోనే 10 దాకా కార్పొరేట్ సంస్థల క్లినిక్‌లు ఉండగా, స్థానిక వైద్యులు మరో 400 మంది దాకా ఉంటారు. ఈ వైద్యవిధానంలో దీర్ఘకాలిక నొప్పి, అలర్జీలు, జీర్ణకోశ వ్యాధులతో సహా మందులు ప్రభావవంతంగా పనిచేస్తాయని వైద్యులు చెబుతున్నారు.

ప్రత్యామ్నాయ వైద్యంగా ఆదరణ



హోమియో వైద్య విధానంలో మొండి రోగాలకు, దీర్ఘకాలిక వ్యాధుల చికిత్సకు ఆదరణ పెరుగుతోంది. ఇతర వైద్య విధానాల్లో నయం కాని వారు హోమియోకు వచ్చి చికిత్స తీసుకుని వ్యాధిని నయం చేసుకుని వెళ్తున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఇందులో ప్రధానంగా నడుం నొప్పులు, ఆర్థరైటిస్, చర్మవ్యాధులు, తరచూ వచ్చే చీముగడ్డలు, గజ్జి, తామర, ఎగ్జిమా, చెవిలో చీము కారడం, ముక్కుదిబ్బడ, గొంతునొప్పి, స్టాన్సిలైటిస్, నాజిల్ పాలిప్స్, గ్యాస్ట్రబుల్, మలబద్దకం, పైల్స్, ఫిషర్, ఫిస్టులా, గాల్‌బ్లాడర్‌లో రాళ్లు, పసిరికలు, అమీబియాసిస్, నరాల సంబంధిత వ్యాధులు (సయాటిక, సర్వికల్ స్పాండిలోసిస్, లాంబార్ స్పాండిలైసిస్), కిడ్నీలో రాళ్లు, పలు రకాల అలర్జీలు, మైగ్రేన్లు, డిప్రెషన్, క్రానిక్ ఫెటిగ్ సిండ్రోమ్, రుమటాయిడ్ ఆర్థరైటిస్, ప్రకోప ప్రేగు సిండ్రోమ్, ప్రీమెన్‌స్ట్రసల్ సిండ్రోమ్ వంటి దీర్ఘకాలిక సమస్యలకు హోమియో మందులు ఫలితాలను ఇస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు.

హోమియోకు ఆదరణ పెరిగింది



గతంలో హోమియో వైద్యం అంటే చాలా అపోహలు ఉండేవి. అల్లో నతి వైద్యం వ్యాధి తీవ్రతను తగ్గిస్తుందనే భావన ఉండేది. ప్రస్తుతం అది పూర్తిగా మారింది. హోమియో మందులతో ఎటువంటి దుష్ప్రభావం ఉండదు. దీంతో హోమియో వైద్యంపై మక్కువ పెరిగింది. పుట్టిన బిడ్డ నుంచి పండు ముసలి వరకు మానవుని అన్ని దశల్లోనూ అన్ని రకాల జబ్బులకు హోమియోలో శాశ్వత చికిత్స ఉంది. వ్యాధి మూలకారణాలను గుర్తించి రోగికి మెరుగైన వైద్యం అందిస్తాం.

– డాక్టర్ వంగల అరుణ, జిల్లెల్ల, హోమియో వైద్యాధికారి

మొండి వ్యాధులకు సైతం వైద్యం



మొండి వ్యాధులకు ముఖ్యంగా థైరాయిడ్, పీసీఓడీ, సొరియాసిస్, వెన్ను, కీళ్ల నొప్పులు, ఆర్థరైటిస్, మానసిక సమస్యలు తదితర ఆరోగ్య వాటికి హోమియో ద్వారా శాశ్వతంగా నివారించవచ్చు. ప్రస్తుతం హోమియోపతి వైద్యంపై ప్రజల్లో ఆదరణ పెరుగుతోంది. తాత్కాలిక రోగాలను వంద శాతం నయం చేసే శక్తి ఉంది. అన్ని రకాల జబ్బులకు హోమియోలో మందులున్నాయి. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ప్రతి కుటుంబం హోమియో వైద్యాన్ని అలవాటు చేసుకుని ఆరోగ్యవంతంగా జీవించాలి. చాపిరేవుల హోమియో డిస్పెన్సరీల్లో అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా చికిత్స, మందులు అందిస్తున్నాం.

– డాక్టర్ విద్యాసాగర్, హోమియో వైద్యాధికారి, చాపిరేవుల

పిల్లల సంరక్షణపై అవగాహన



ముత్తలూరులో తల్లులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్

రుద్రవరం: చిన్నపిల్లల సంరక్షణపై తల్లులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు ఐసీడీఎస్ సూపర్ వైజర్ లక్ష్మీదేవి తెలిపారు. పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని ముత్తలూరు అంగన్‌వాడీ కేంద్రం-2లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్ వైజర్ తల్లులతో మాట్లాడుతూ బిడ్డ పుట్టినప్పటి నుంచి వెయ్యి రోజుల వరకు వారి సంరక్షణపై శ్రద్ధ వహించాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ లలితమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ సుస్మితా రాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు సుగణ, రాజకుమారి, రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

వరిలో పంట కోత ప్రయోగాలు

ఉయ్యాలవాడ : ఈ ఏడాది రబీ సీజన్‌లో కుందూ వెంట సాగు చేసిన వరిలో పంట కోత ప్రయోగాలు బుధవారం చేపట్టారు. మండల పరిధిలోని సుద్దమల్ల గ్రామంలో రైతు పల్లె వెంకటేశ్వరరెడ్డి సాగు చేసిన వరి పొలంలో 5 మీటర్ల విస్తీర్ణంలో పంట కోత ప్రయోగాలు చేపట్టగా 18.100 కేజీల దిగుబడులు వచ్చాయి. ఎకరాకు 35 నుంచి 36 బస్తాలు దిగుబడులు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఏఈఓ రాణెమ్మ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఈఓలు ప్రసాద్, ఆశాబీ, వీఏఏస్‌లు జగన్‌మోహన్, సిద్దిక్ బాషా పాల్గొన్నారు.

ముస్లింల హక్కులకు భంగం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

నంద్యాల(వ్యవసాయం): వక్ఫ్ చట్ట సవరణ బిల్లు తీసుకురావడం వల్ల ముస్లింల హక్కులకు భంగం కలిగిందని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, ఏపీసీసీ జనరల్ సెక్రెటరీ మోహనరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. బుధవారం నంద్యాల ముస్లిం జేఏసీ కన్వీనర్ మౌలానా అబ్దుల్లా రషాది అధ్యక్షతన 'వక్ఫ్‌బోర్డును కాపాడండి – రాజ్యాంగాన్ని రక్షించండి' నినాదంతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. స్థానిక నూర్ భాషా సంఘం షాదీఖానలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్, రాజ్యసభలలో ఆమోదింపజేసుకున్న వక్ఫ్ సవరణ చట్టం పట్ల ముస్లింలెవ్వరూ సంతోషంగా లేరన్నారు. ఈ బోర్డులోకి ముస్లిం మేతరులను చేర్చడం సరికాదన్నారు. దేవదాయ శాఖకు లేని కండీషన్‌లు వక్ఫ్‌బోర్డుకు పెట్టడం ముస్లింల పట్ల చిన్నచూపునకు నిదర్శనమన్నారు. ముస్లింలకు చెందిన ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టడానికి కేంద్రం కుట్ర పన్నుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నంద్యాల ముస్లిం జేఏసీ నాయకులు అబ్దుల్ సమద్ ఎస్ఎండీ అబులైస్, ట్రెజరర్ ఎస్పీ బాష, కో కన్వీనర్ మస్తాన్, మీడియా సెక్రెటరీ ఉస్మాన్ బాషా, ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబర్లు గోల్డ్, మజీద్ ఖాన్, అబ్దుల్ మునీర్, అబ్దుల్ సలాం, అయూబ్, హఫీజ్ సుభాన్, సయ్యద్ అబ్దుస్ సమద్, తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల తనిఖీ

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని పలు ప్రభుత్వ వసతి గృహాలను ఆంధ్రప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి బుధవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా కస్తూర్బా బాలికల ఉర్దూ రెసిడెన్సియల్ పాఠశాలలో వంటశాలను తనిఖీ చేసి మెనూను పరిశీలించారు. విద్యార్థినుల అడిగి మెనూ పాటిస్తున్నారా లేదా, భోజన నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి ఎస్సీ బాలికల వసతి గృహం, బీసీ బాలికల వసతి గృహాలను తనిఖీ చేసి కూరగాయలు, బియ్యం,కందిపప్పు తదితర వస్తువుల నాణ్యతను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వసతి గృహాల్లో మెనూ విషయంలో ఎలాంటి సమస్యలు ఉన్నా 94905 51117 అనే నంబరకు వాట్సాప్ చేసి సమాచారం అందజేయాలని సూచించారు. కాగా తనిఖీపై ముందుగానే అన్ని శాఖల అధికారులకు తెలియడంతో వసతి గృహాల అధికారులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిసింది. తహసీల్దార్ నారాయణరెడ్డి,ఎంపీడీఓ వెంకటరమణ,ఎంఈఓలు ఉన్నారు.

కోసూరు వృషభాలు విజేత




విజేతకు మెగా చెక్కు అందజేస్తున్న డీసీ ప్రెసిండెంట్ బబ్బూరి వెంకటస్వామి

దొర్నిపాడు: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో రామాలయం నిర్మించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా బుధవారం అఖిల భారత ఒంగోలు జాతి బండలాగు బలప్రదర్శన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ జిల్లా కోసూరుకు చెందిన బ్రహ్మానాయుడు ఎడ్లు మొదటి బహుమతి సొంతం చేసుకున్నాయి. దాత డీసీ ప్రెసిడెంట్ బబ్బూరి వెంకటస్వామి రూ.60వేల చెక్కును గెలిపొందిన వారికి అందజేశారు. కృష్ణ జిల్లా తెంపల్లికి చెందిన శ్రీనివాసరావు రూ.40 వేలను గద్దం సుబ్బారావు, బాపట్ల జిల్లా ఉప్పమాగులురు చెందిన రవిశంకర్‌రెడ్డి రూ.30వేలు గడ్డిపాటి శివభగవంతరావు, కడప జిల్లా కుమ్మరి కొట్టాలకు చెందిన గోపాలకృష్ణకు రూ.20వేలను సామినేని వెంకటేశ్వర్లు, ప్రకాశం జిల్లా మరివేములకు చెందిన మల్లేశ్వరికి రూ.10వేలను పామిడి నాగేశ్వరరావు, బండిఆత్మకూరు మండలం ఎ.కోడూరుకు చెందిన నాగమల్లికార్జున రెడ్డి రూ.7500ను బద్దల తిరుపాల్, శిరివెళ్ల మండలం వనికెందిన్నెకుచెందిన పెద్ద సరసయ్యకు రూ.5116లను కందిమళ్ల రంగరావు ఇలా వరుసగా ఎనిమిది బహుమతులు అందజేశారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు



బేతంచెర్లలో బండ లాగుతున్న వృషభాలు



135 కేజీల గుండును ఎత్తిన మాధవ వరం రాజశేఖర్

బేతంచెర్ల: పట్టణ సమీపంలో వెలసిన చౌడేశ్వరీదేవి తిరునాలను పురస్కరించుకొని స్థానిక శేషారెడ్డి హైస్కూలు మైదానంలో పాల పండ్ల బండలాగుడు పోటీలను నిర్వహించారు. బుధవారం ఉదయం పారిశ్రామిక వేత్తలు, ఆలయ కమిటీ సభ్యులు గౌరి హుస్సేన్‌రెడ్డి, మల్లు సుబ్బారెడ్డి పోటీలను ప్రారంభించారు. ఆయా ప్రాంతాల నుంచి 7 జతల వృషభాలు పాల్గొనగా.. హోరా హోరీగా సాగిన పోటీల్లో తెలంగాణ రాష్ట్రం, నాగర్ కర్నూలు జిల్లా అక్షరారెడ్డి వృషభాలు ప్రథమ, బేతంచెర్ల మండలం వైబీ శేఖర్ రెడ్డి ద్వితీయ, బేతంచెర్ల మేకల భానుజ 3వ స్థానం , ఉయ్యాలవాడ మండలం, నర్సిపల్లి గ్రామం ఉప్పర లక్ష్మీదేవి 4వ, బనగానపల్లె మండలం, రామకృష్ణాపురం 5వ స్థానంలో నిలిచాయి. వృషభాల యజమానులకు దాతల సహకారంతో వరుసగా రూ.50 వేలు, రూ 40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10వేలు బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు రఘురామిరెడ్డి, శేఖర్‌రెడ్డి, మద్దయ్య, రామస్వామి, అన్నారావు తదితరులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీల విజేత బీ తాండ్రపాడు

మండలపరిధిలోని ఆర్ బుక్కాపురం గ్రామంలో శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా పాల పండ్ల వృషభాలకు బండలాగుడు పోటీలను నిర్వహించారు. పోటీల్లో కర్నూలు మండలం, బీ తాండ్రపాడు వరలక్ష్మి వృషభాలు ప్రథమ, నంద్యాల మండలం, గుండం చెన్నారెడ్డి ద్వితీయ, వైఎస్సార్ కడప జిల్లా వంశీయాదవ్ తృతీయ, బేతంచెర్ల మండలం మేకల భానుజ వృషభాలు 4వ స్థానం కైవసం చేసుకున్నాయి. దాతల సహకారంతో వీరికి వరుసగా రూ. 25 వేలు, రూ. 15 వేలు, రూ. 10 వేలు, రూ. 5 వేలు అందజేశారు. అలాగే గుండు, పరుగు పందెం పోటీలను నిర్వహించారు. 135 కేజీల గుండు పందెంలో ప్యాపిలి మండలం మాధవ వరం రాజశేఖర్ ప్రథమ, డోన్ మండలం గోసానిపల్లె వేణుగోపాలు ద్వితీయ, ప్యాపిలి మండలానికి చెందిన రంగస్వామి తృతీయ స్థానంలో నిలువగా వారికి వరుసగా రూ. 3వేలు, 2 వేలు, రూ.వెయ్యి నగదు బహుమతులు అందజేశారు. పరుగు పందెం పోటీల్లో సిద్ధనగట్టు నవీన్, ఆర్ బుక్కాపురం తలారి హరీశ్ ప్రథమ, ద్వితీయ, కోడుమూరు శివ తృతీయ స్థానం కైవసం చేసుకోగా రూ. 2వేలు, రూ. 1500, రూ. 500 నగదు బహుమతులను గ్రామ సర్పంచ్ నాగరాజు అందజేశారు.

శాస్త్రీయ సదస్సులతో పరిశోధన శక్తి వృద్ధి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రామనారాయణరెడ్డి

నంద్యాల(అర్బన్): ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించే శాస్త్రీయ సదస్సులు విద్యార్థుల్లో నూతన ఆలోచనలు, పరిశోధనల పట్ల ఆసక్తి పెంచుతాయని ఇందిరా గాంధీ ఢిల్లీ టెక్నికల్ యూనివర్సిటీ ఫర్ ఉమెన్ (ఐజీటీటీయూడబ్ల్యూ) ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ రామనారాయణరెడ్డి తెలిపారు. స్థానిక ఎస్‌వీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం తెల ఏఐ బోధన-సహకార అభివృద్ధి వ్యూహాలు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మధ్య సహకార అభ్యసనాన్ని ప్రోత్సహించాలన్నారు. పరస్పర మేధస్సు మార్పిడి, పరిశోధనల ప్రోత్సాహాలతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ఎండీ దినేష్ రెడ్డి, ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు పాడి గేదెలు మృతి



మృతి చెందిన గేదెలు

రుద్రవరం: మండల పరిధిలోని మందలూరులో బుధవారం విద్యుదాఘాతానికి గురై రెండు పాడి గేదెలు మృతి చెందాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు..వీరభద్రుడు అనే రైతు గేదెలను మేపుకునేందుకు గ్రామ సమీపంలోని పెద్దవాగు వంకవైపు వెళ్లాడు. అక్కడ దాహం తీర్చుకునేందుకు గేదెలు వంకలోకి దిగాయి. అయితే, అప్పటికే కొందరు వ్యక్తులు వంకలో చేపలు పట్టుకునేందుకై విద్యుత్ సరఫరాతో తీగలను వేసి ఉన్నారు.ఆ తీగలు తగలగానే విద్యుత్‌షాక్‌కు గురై రెండు పాడి గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో ఆ రైతుకు దాదాపు రూ.2 లక్షల నష్టం వాటిల్లినట్లు గ్రామస్తులు తెలిపారు. గతంలో కూడా ఇలా తీగలు వేయడంతో వంకలో పెద్ద సంఖ్యలో చేపలు మృతి చెందాయని, మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

ఆయిల్‌పామ్ సాగుతో బహుళ ఆదాయం



మాట్లడుతున్న చెన్నయ్య

సంజామల: ఆయిల్‌పామ్ పంట సాగుతో పాటు అంతర్ పంటలు వేసుకోవడం వల్ల రైతులు బహుళ ఆదాయం పొందవచ్చునని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ అధికారి చెన్నయ్య అన్నారు. మండలంలోని నొస్సం గ్రామంలో పతంజలి ఫుడ్ లిమిటెడ్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ ఫామ్ పంట సాగుపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లడుతూ..ఆయిల్‌పామ్ పంట సాగు చేసే రైతులకు ఉచితంగా ఎకరాకు 57 మొక్కలు అందిస్తామన్నారు. ఆయిల్‌పామ్ సాగు చేసుకున్నందుకు ఎకరాకు సంవత్సరానికి రూ.10,500 ప్రభుత్వం నుంచి వస్తుందని చెప్పారు. నాటుకున్న నాలుగో సంవత్సరం నుంచే గెలలు వస్తాయన్నారు.ఇలా 25 సంవత్సరాలు గెలలు వస్తాయన్నారు.దాదాపు సంవత్సరానికి రూ.1.50 లక్షలు ఆదాయం వస్తుందని తెలిపారు. జిల్లాలో ఆయిల్‌పామ్ పంట సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారన్నారు. ఆసక్తిగల రైతుల మండల ఉద్యాన శాఖ అధికారులను కలవాలని సూచించారు. కోవెలకుంట్ల డివిజన్ వ్యవసాయ అధికారి సుధాకర్, ఉద్యాన శాఖ అధికారి రఘువరన్, పతంజలి ఫుడ్ లిమిటెడ్ కంపెనీ జిల్లా మేనేజర్ మహదేవ్ పాల్గొన్నారు.

గర్భిణులు ఆరోగ్య సూత్రాలు పాటించాలి



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అశోక్

ఉయ్యాలవాడ : గర్భిణులు ఆరోగ్య సూత్రాలు పాటించాలని వైద్యాధికారి అశోక్ సూచించారు. బుధవారం మండలంలోని మాయలూరు పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్(పీఎంఎస్ఏ) కార్యక్రమంలో భాగంగా 29 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవించే వరకు ప్రతి నెల వైద్యాధికారులను సంప్రదించి సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, గుడ్లు, పాలు, తదితర పౌష్టికాహారం తీసుకోవడం వల్ల తల్లి, బిడ్డకు శ్రేయస్కరమన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు కృష్ణ, ప్రభావతమ్మ పాల్గొన్నారు.

నేత్రాలకు చల్లని నేస్తాలు!

- కూలింగ్ కళ్లద్దాలతో కంటికి రక్షణ
- రోజు రోజుకూ పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతలు
- జాగ్రత్తలు సూచిస్తున్న కంటి వైద్య నిపుణులు



నంద్యాల(న్యూటౌన్): వేసవికాలం ప్రారంభమైంది. ఎండ తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. ఈ సమయంలో శరీరంతో పాటు కళ్లమీద కూడా శ్రద్ధ చూపడం చాలా మంచిది. ఏమాత్రం అశ్రద్ధ చేసినా కంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ముఖ్యంగా వేసవిలో సరైన కంటి జాగ్రత్తలు తీసుకోకపోతే అపాయ మేనని నేత్ర వైద్యులు చెబుతున్నారు. అత్యవసర సమయంలో ఎండలో తిరిగే ప్రతి ఒక్కరూ కూలింగ్ గ్లాసెస్ తప్పనిసరిగా వాడాలని చెబుతున్నారు.

చూపు మందగించే ప్రమాదం...

కళ్లలోని అతి సున్నితమైన భాగాలకు వేడి తగలడం వల్ల చూపు మందగించే ప్రమాదం ఉంది. శరీర భాగాల్లో కళ్లు ఎంతో సున్నితమైనవి. ప్రధానమైనవి. మిట్ట మధ్యాహ్నం లేదా ఉష్ణోగ్రత ఎక్కువగా ఉన్న సమయంలో ప్రయాణం చేయడం కంటికి మంచిది కాదు. తప్పనిసరి పరిస్థితుల్లో వాహనం నడిపితే హెల్మెట్ లేదా కళ్లజోడును పెట్టుకోవాలి. దుమ్ము, ధూళి కంటిలో పడడం వల్ల విపరీతమైన కంటి దురదలు ఏర్పడతాయి. నల్లగుడ్డు చుట్టూ పొరలు రావడం. ఎర్రని చారలు, కంటి వెంట తీగలాంటి స్రావం కారడం జరుగుతుంది. ఇటువంటి సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఒక్కోసారి జీవితాంతం చూపు కోల్పోయే ప్రమాదం ఉంది.

నలపకూడదు...

మధ్యాహ్నం సమయంలో ఎండ చాలా తీవ్రంగా ఉంటుంది కళ్లకు రక్షణ కవచాలు లేకుండా తిరిగితే మంట పుట్టడంతో పాటు కళ్లు ఎర్రబడతాయి. ఇటువంటి సందర్భాల్లో కళ్లను చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. వెంటనే సమీపంలోని ఉన్న నేత్ర వైద్యులను సంప్రదించాలి. కళ్లను నలపడం చేయరాదు. తీవ్రమైన ఎండలో బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడల్లా సన్ గ్లాసెస్ ఉపయోగించాలి. బైక్, కారు లేదా మరి ఏదైనా వాహనం నడుపుతున్నప్పుడు సన్ గ్లాసెస్ ధరించడం వల్ల దుమ్ము కణాలు లేదా వేడి గాలి కళ్లలోకి రాకుండా చేస్తుంది. ద్విచక్ర వాహనదారులు వీలైనంత వరకు క్లోజ్డ్ హెల్మెట్‌లను వాడటం మంచిది. 100శాతం యూవీ రక్షణను అందించే నాణ్యమైన సన్ గ్లాసెస్‌ని వాడాలి. యూవీ కిరణాలు కళ్లను దెబ్బతీస్తాయి. ఇది కంటి శుక్లం, మాక్యులార్ డీజెనరేషన్ వంటి సమస్యలకు దారి తీస్తుంది. కాబట్టి యూవీఏ, యూవీబీ కిరణాలను నిరోధించే సన్ గ్లాసెస్ ఉపయోగించాలి.

జాగ్రత్తలు పాటించాలి



వేసవిలో ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. అయినా, తప్పరిపరిస్థితిలో బయటకు వెళ్లాల్సి ఉంటుంది. ద్విచక్రవాహనాలపై ప్రయాణించినప్పుడు, రోడ్లపై వెళ్లేటప్పుడు వేసవిలో ఎండ ప్రభావంతో వచ్చిన వెలుతురు, వేడికి కళ్లకు తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల వాళ్ల కళ్లలోని రక్షణ పొర కరిగిపోయి, ఫొటో సెన్సిటివిటీకి గురవుతాయి. దాంతో కళ్లు మరింత సున్నితమైపోయి, క్రమేపీ వెలుగును చూడలేని స్థితికి చేరుకుంటాయి. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా బయటకు వెళ్లినప్పుడల్లా చలువ కళ్లద్దాలను, హెల్మెట్ లేదా క్యాప్ ధరిస్తూ జాగ్రత్తలు పాటించాలి.

–విజయభాస్కరరెడ్డి, కంటి వైద్యుడు, నంద్యాల

కంటి చూపు మెరుగుకు ఆహారం

కంటి చూపు మెరుగుపరుచుకోవడానికి సమతుల ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. ప్రధానంగా తీసుకునే ఆహారంలో ఎక్కువగా యాంటీ ఆక్సిడెంట్లు. ఏ, సీ విటమిన్లు ఉండేలా చూసుకోవాలి. ముఖ్యంగా ఆకుకూరలు అధికమొత్తంలో తీసుకోవాలి. ఎందుకంటే ఇవి పుష్కలంగా యాంటీ ఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. పాలకూర వంటివి కూడా కంటి ఆరోగ్యానికి బాగా సహాయపడతాయి. అలాగే ఒమెగా-3 కొవ్వు ఆమ్లాలు అధికంగా ఉండే చేపలు తీసుకోవాలి. ఇవి కంటి చూపు మెరుగుపడేందుకు దోహదపడతాయి.